



ఉమామహేశ్వరంలో శైలపుత్రీ దేవిగా అమ్మవారు



అలంపూర్‌లో శైలపుత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

శైలపుత్రీ దేవిగా జోగుళాంబ

- శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

అలంపూర్/ అచ్చంపేట అర్బన్, అక్టోబరు 3 : తొమ్మిది రోజుల పాటు వైభవంగా నిర్వహించే దసరా ఉత్సవాలు జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూరులోని జోగుళాంబ ఆలయంలో గురువారం అంకురారోహణ, ధ్వజారోహణంతో ప్రారంభం అయ్యాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాలను పూల మాలలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామి, అమ్మవారి గర్భాలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు అమ్మవారి విగ్రహాన్ని నదీ జలాలతో అభిషేకించి అర్చన, హోమం వంటి పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో పురేందర్ కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి దర్బారు సేవలో శైలపుత్రీ దేవి అలంకరణలో విశేష పూజలను అందుకొని భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని ఉమామహేశ్వర క్షేత్రంలో అమ్మవారు శైలపుత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు అర్చకులు వీరయ్య భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లను చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రేంజ్ డ్యూటీమీట్‌లో మాట్లాడుతున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

పోలీసులు ప్రతిభ కనబరచాలి

- జోగుళాంబ రేంజ్ డ్యూటీ మీట్ ప్రారంభించిన డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

మహబూబ్‌నగర్, అక్టోబరు 3: పోలీస్ డ్యూటీ మీట్‌లో పోలీసులు ప్రతిభ కనబరచాలని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. ఇప్పటికే జిల్లాల స్థాయిలో డ్యూటీ మీట్ ముగిసిందని, అందులో ప్రతిభ కనబరిచిన వారితో ఇప్పుడు రేంజ్ డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నామని, ఇక్కడ సత్తా చాటిన వారు రాష్ట్రమీట్, అక్కడి నుంచి జాతీయ డ్యూటీ మీట్‌కు ఎంపికవుతారన్నారు. అందుకే పోలీసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గురువారం పాలమూరు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ఎస్పీ జానకితో కలిసి రేంజ్ డ్యూటీ మీట్‌ను ప్రారంభించారు. పోలీసు అధికారులు, సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఇది మంచి వేదిక అని, ఇది క్రైం ఇన్వెస్టిగేషన్, సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్‌కు ఉపయోగపడుతుందన్నారు. చట్టం నుంచిఒక క్రిమినల్ తప్పించుకోకుండా ఉండేందుకు ఇలాంటివి పోలీసులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఇక్కడ విజయం సాధించి రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని కోరారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ ఏ రాములు, అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, నాగర్‌కర్నూల్ అదనపు ఎస్పీ రామేశ్వర్, వనపర్తి అదనపు ఎస్పీ రామ్‌దాస్‌తేజ, నారాయణపేట అదనపు ఎస్పీ రియాజ్‌ఉల్‌హక్, డీఎస్పీ వెంకటే శ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కార్డుల సర్వే షురూ..



జడ్చర్ల మండలం అల్వాన్‌పల్లిలో డిజిటల్ కార్డుల సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రవి గుగులోత్

- నియోజకవర్గానికి ఒక గ్రామం, పట్టణంలో ఒక వార్డు ఎంపిక
- రేషన్, హెల్త్, ఇతర పథకాల కోసం వివరాల సేకరణ
- కుటుంబంలో కొత్త సభ్యుల చేరిక.. లేని సభ్యుల పేర్ల తొలగింపు
- అసలే కార్డులు లేని వారి వివరాలు కూడా సేకరించాక నివేదిక
- ఏళ్లుగా దరఖాస్తు చేసి.. ఎదురు చూస్తున్న వేల మంది అర్హులు

మహబూబ్‌నగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణలో కొన్నేళ్లుగా కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేయని విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామని హామీ ఇచ్చింది. ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా అభయహస్తం పేరుతో అన్నింటితోపాటు రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించింది. ఇప్పటివరకు అమలవుతున్న పథకాలకు రేషన్ కార్డులనే ప్రామాణికంగా తీసుకుంటుండంతో చాలా పథకాలకు ఏళ్ల కిందటే దరఖాస్తు చేసుకుని వేల మంది అర్హులు ఎదురు చూస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ. 5లక్షల పరిమితిని రూ. 10 లక్షలకు పెంచింది. ఈ కార్డులు కూడా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినవే తప్పా.. మళ్లీ కొత్తగా ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో గాంధీ జయంతి నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఆ ప్రక్రియను వాయిదా వేసి.. తెలంగాణ డిజిటల్ కార్డుల మంజూరిపై దృష్టి సారించింది. ఆ కార్డు మంజూరైతే రేషన్‌తోపాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఆరు గ్యారెంటీల అమలుకు ప్రమాణికంగా తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదట సర్వే నిర్వహించి.. వివరాలు సేకరించిన తర్వాత.. కార్డులను మంజూరు చేయనున్నారు. ఆ సర్వే గురువారం నుంచి ప్రారంభం కాగా.. అయిదు రోజులపాటు కొనసాగనుంది. పైలెట్ కార్యక్రమం పూర్తయిన వెంటనే ఆర్థిక అర్హతలతో సంబంధం లేకుండా అందరికీ డిజిటల్ కార్డులను మంజూరు చేస్తారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్‌లను స్పెషల్ ఆఫీసర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా.. ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు ఇటీవలి వరకు ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన రవి గుగులోత్‌ను నియమించారు.

ఇంటిపెద్దగా మహిళ

డిజిటల్ కార్డులన్నింటిని ఇంటి పెద్దగా మహిళ ఉండేట్లు సర్వే నిర్వహిస్తున్నారు. పేరు, జెండర్, డేట్ ఆఫ్ బర్త్, వయసు, కుటుంబ పెద్దతో సంబంధం, ఫోన్ నెంబరు, ఆధార్ నెంబరు, అడ్రస్సు, చేర్చుతున్న సభ్యుడు ఆ ఇంటికి చెందివాడా కాదా? అనే వివరాలను నిర్దేశిత ఫారాల్లో పొందుపర్చుతున్నారు. అప్పటికే ఉన్న రేషన్ కార్డు డేటాను ప్రింట్ తీసుకున్న అధికారులు.. అందులో సదరు వివరాలను నమోదు చేస్తున్నారు. ఒకవేళ పాత కార్డు ప్రకారం ఉండాల్సిన సభ్యులు లేకుంటే వారిని తొలగించి.. కొత్తగా ఎవరైనా సభ్యులు ఉంటే వారి పేర్లను నమోదు చేస్తున్నారు. గత ప్రభుత్వం నుంచి కొత్త కార్డులు కానీ, కార్డుల్లో మార్పులు, చేర్పులు జరగలేదు. ఇప్పుడు ఈ సర్వే ప్రకారం గతంలో పెండింగ్ పడిపోయి.. అర్హత ఉండి కార్డులు లేని వారందరికీ ఉపకరంగా ఉండనుంది. అలాగే ఇవి కేవలం రేషన్ కార్డులకు మాత్రమే కాకుండా ఇతర ప్రయోజనాలకు ప్రామాణికంగా తీసుకుంటుం డటంతో ఇబ్బందులు దూరమవుతాయని ప్రజలు భావిస్తున్నారు. పైలెట్ గ్రామాల నివేదిక వచ్చిన తర్వాత ఏం చేయాలనే విషయాలపై కేబినెట్ సబ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్ణయం జరిగే అవకాశం ఉంది.



సీసీ కుంట మండలం సీతారాంపేటలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు సర్వే జరిగే వార్డులు, గ్రామాలు

మునిసిపాలిటీ	వార్డు నెంబరు	మండలం	గ్రామం పేరు
పాలమూరు	37వ వార్డు	హన్వాడ	మాదారం
జడ్చర్ల	24వ వార్డు	జడ్చర్ల	అల్వాన్‌పల్లి
భూత్పూరు (దేవరకద్ర)	9వ వార్డు	సీసీ కుంట	సీతారాంపేట
వనపర్తి	10వ వార్డు	వనపర్తి	అంజనగిరి
నాగర్‌కర్నూలు	7వ వార్డు	బిజినేపల్లి	బోయాపూరు
అచ్చంపేట	14వ వార్డు	అచ్చంపేట	బ్రాహ్మణపల్లి
కొల్లాపూర్	3వ వార్డు	పెద్దకొత్తపల్లి	దేదినేనిపల్లి
కల్వకుర్తి	10వ వార్డు		
నారాయణపేట	15వ వార్డు	దామరగిద్ద	అయ్యవారిపల్లి
మక్తల్	13వ వార్డు	ఉట్కూరు కోస్గి	కొత్తపల్లి ముక్తిపాడ్
గద్వాల	9వ వార్డు	కేటీదొడ్డి	మైలగడ్డ
అయిజ	3వ వార్డు	అలంపూర్	రేలంపాడు

ఉమ్మడి జిల్లాలో రేషన్ కార్డులు, సరఫరా అవుతున్న బియ్యం

జిల్లా	కార్డుల సంఖ్య	లబ్ధిదారుల సంఖ్య	బియ్యం మెట్రిక్ టన్నుల్లో
మహబూబ్‌నగర్	238951	789790	5085
వనపర్తి	157100	516194	2500
జోగుళాంబ గద్వాల	160106	545813	3461
నారాయణపేట	140322	508486	3217
నాగర్‌కర్నూలు	237821	750241	4819

అనుమతులు ఒక చోట..
నిర్వహణ మరో చోట

- మండల కేంద్రాల్లో నిర్వహించని గురుకుల పాఠశాలలు - ఇబ్బందుల్లో విద్యార్థులు

మండల కేంద్రాల పేరుమీద మంజూరైన గురుకుల పాఠశాలలు పేరుకే పరిమితం అయ్యాయి.. నిర్వహణ మాత్రం ఇంకోచోట.. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. దామరగిద్ద ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలను పేట సింగారం చౌరస్తాలో నిర్వహిస్తున్నారు. నర్వ, ఊట్కూర్ ఎస్సీ గురుకులాలు మక్తల్‌లోని అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. మక్తల్ జూనియర్ కళాశాల విద్యార్థులకు పేట గురుకులాల్లోనే చదువులు.. కోటకొండ బీసీ గురుకుల పాఠశాల మరికల్‌లోని అద్దెభవనంలో కొనసాగుతోంది.



నారాయణ పేట గురుకుల పాఠశాలలో పనిచేయని నీటి శుద్ధి యంత్రం



మక్తల్‌లో కొనసాగుతున్న ఊట్కూర్ గురుకుల పాఠశాల

నారాయణపేట, అక్టోబరు 3 : జిల్లాలోని పలు ఎస్సీ బీసీ గురుకుల పాఠశాలలు మండల కేంద్రాల్లో లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రాల పేరుతో గురుకులాలు మంజూరై మరోచోట అది కూడా అరకొర వసతులతో అద్దె భవనాల్లో నిర్వహిస్తుండటంతో నిత్యం విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మండల కేంద్రాలకు గురుకులాలు మంజూరు చేసినా క్షేత్ర స్థాయిలో మాత్రం మండల కేంద్రాల్లో నిర్వహించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఒక మండలానికి మం జూరైన గురుకుల పాఠశాల ఇంకో మండలంలో కొనసాగించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఏ మండలానికి మంజూరైన గురుకుల పాఠశాలలను అయా మండల కేంద్రాల్లో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. మక్తల్ పట్టణంలో నర్వ ఎస్సీ గురుకుల పాఠశాల ఎల్లమ్మ కుంట దగ్గర అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఊట్కూర్ ఎస్సీ గురుకుల పాఠశాల మక్తల్ నారాయణపేట రోడ్‌లో అద్దె భవనంలో కొనసాగుతోంది. మక్తల్ ఎస్సీ గురుకుల పాఠశాల సంగబండ రోడ్‌లో సొంత భవనంలో కొనసాగుతోంది. దామరగిద్ద ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల నారాయణ పేట సింగారం చౌరస్తాలో కొనసాగుతోంది. కానీ ఏ గురుకుల పాఠశాలలో చూసినా కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీరు సక్రమంగా అందడంలేదు. బాత్ రూంల డోర్‌లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పేట మండలం బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల మరికల్ మండల కేంద్రంలో ఇరకైన భవనంలో నిర్వహించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.నారాయణపేట బాలికల గురుకుల పాఠశాల సొంత భవ నంలో కొనసాగుతోంది. మక్తల్ గురుకుల ఇంటర్ విద్యా ర్థులు పేట గురుకుల పాఠశాలలోనే కొనసాగుతుండడం కొస మెరుపు. విద్యార్థులు అధిక సంఖ్యలో ఉండడంతో పాటు వసతులు కూడా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. ఐదు నుంచి పదో తరగతి వరకు 472 మంది విద్యార్థిను లు చదువు తుండగా ఇంటర్ పేట గురుకుల విద్యార్థులు 222 మంది, మక్తల్ గురుకుల ఇంటర్ విద్యార్థులు 62 మంది మొత్తం 284 మంది చదువుతున్నారు. ముఖ్యంగా పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఇరుకు గదుల్లో బోధన చేస్తే తమ పిల్లల భవిష్యత్ ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ ఉంటేనే బోరునీరు అందుతోంది. వాటర్ ట్యాంకు పాడవడంతో పాటు ఫిల్టర్ పనిచేయక బోరు నీటిని తాగుతున్నారు. శుద్ధ జలాలు లేక విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. వెంటనే ఉన్నతాధికారుల స్పందించి శుద్ధ జలాలు అందించాలి.

బొక్కేస్తున్నారు

ప్రభుత్వానికి బియ్యం ఇవ్వడంలో జాప్యం చేస్తున్న మిల్లర్లు

- జిల్లాలో వీరికి కాకుండా ఇతరులకు ఇవ్వని ధాన్యం
- అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్న మిల్లర్లు
- ఏడు మిల్లులకు రూ. 45కోట్ల ధాన్యం కేటాయింపు
- ఖాతా తెరువని నాలుగు మిల్లులు
- వారికే వత్తాసు పలుకుతున్న అధికారులు



గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ రైస్ మిల్లులో నిల్వ ఉంచిన ధాన్యం(ఫైల్)

గద్వాల క్రైం, అక్టోబరు 3 : జోగుళాంబ గద్వాల జిల్లాలో ప్రభుత్వం మిల్లులకు కోట్లలో విలువచేసే సీఎంఆర్ ధాన్యం ఇస్తూ వాటిని ప్రభుత్వానికి బియ్యం రూపంలో ఇవ్వాలని కోరింది. అధికారుల అండ దండలతో ప్రభుత్వానికి బియ్యం ఇవ్వకపోగా మళ్లీ కొత్తగా వారే ధాన్యం తీసుకొని కోట్ల రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేమిటీ అని ఏ అధికారి అయిన అడిగితే రాజకీయనేతల పేర్లు చెప్పి భయభ్రాంతుకు గురిచేస్తున్నారు. ఇందులో ఓ నలుగురు మిల్లర్లు చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ. 25 కోట్ల ధాన్యం మేర కుంభకోణం

జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఏడు మిల్లులకు 2023-24(ఏప్రిల్) రబీ సీజన్‌కు సంబంధించి సుమారుగా రూ. 45 కోట్ల విలువ చేసే ధాన్యం ప్రభుత్వం కేటాయించింది. మూడు నెలల గడువులోగా ప్రభుత్వానికి బియ్యం ఆయా మిల్లులు ఇవ్వాల్సి ఉన్నది. ఏడు మిల్లుల్లో మూడు మిల్లుల యజమానులు మాత్రం కొంతమేర ప్రభుత్వానికి బియ్యం పంపించారు. మిగితా నాలుగు మిల్లుల యజమానులు ఒక్క గింజకూడా ప్రభుత్వానికి ఇవ్వలేదు. ఇంత జరుగుతున్నా అధికారులు వారు చెప్పిన వారికే ధాన్యాన్ని కేటాయిస్తున్నారని, మిగితా మిల్లర్లను పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగు మిల్లర్ల నుంచి ప్రభుత్వానికి రూ. 25 కోట్ల విలువ చేసే బియ్యం రావాల్సి ఉందని సమాచారం. ఈ బియ్యం వీరు ఇవ్వకపోగా మళ్లీ వచ్చే సీజన్‌లో కూడా వీరికే ధాన్యం కేటాయింపులు జరుగుతాయనే ఆరోపణలు వస్తున్నాయి.

గతంలో కూడా కోట్ల విలువ చేసే బియ్యం లూటీ

2021-22 ఖరీఫ్‌కు సంబంధించి దాదాపు రూ. 30 కోట్ల విలువ చేసే బియ్యం లూటీ జరిగినట్లు అప్పట్లో జిల్లా అంతటా సంచలనంగా మారింది. ఇందులో అయిజలోని అన్నపూర్ణ రైస్‌మిల్లు, గద్వాల మండలం కాకులారంలోని శ్రీకృష్ణా రైస్ మిల్లు, శాంతినగర్‌లోని సూర్యా రైస్ మిల్లుపై కేసులు కూడా నమోదు అయ్యాయి. కానీ, ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. ముఖ్యంగా ఇలా కుంభకోణం చేసిన వారి ఆస్తులను జప్తుచేయాల్సింది ఉండగా అధికారులు వారికే వత్తాసు పలికారని ఆరోపణలు వస్తున్నాయి.

ఆ నలుగురు చెప్పిందే వేదం

జోగుళాంబ గద్వాల జిల్లాలో 70 రైస్ మిల్లుల ఉండగా ఇందులో 60 రైస్ మిల్లులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఓ నలుగురు రైస్ మిల్లరు చెప్పిందే వేదం. వారు చెప్పిన వారికే ధాన్యం ఇవ్వడం. గతంలో ఉన్న అధికారి అందరిని ఒకలా, వీరిని మరోలా చూస్తూ కోట్లు దండుకునేలా సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఇందులో ఉన్న ముగ్గురు రైస్ మిల్లర్లందరికి ప్రభుత్వం నుంచి ధాన్యం వచ్చేలా చేస్తామని, సంబంధిత అధికారికి ఒక్కొక్క మిల్లు నుంచి రూ.50వేలు ఇవ్వాలని ఈ ముగ్గురిలో ఓ రైస్‌మిల్లు యజమాని వసూలు చేసినట్లు సమాచారం.

బియ్యం ఇచ్చే వారికే ధాన్యం

ప్రభుత్వానికి బియ్యం ఇచ్చేవారినే ఎంపిక చేసి ధాన్యం ఇస్తున్నాం. ఇందులో ఎవరిపై తమకు అయిష్టత లేదు. మిగితా మిల్లరు కూడా బియ్యం ఇస్తామంటే ధాన్యం కేటాయిస్తాం. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఒక మిల్లర్ ఎక్కువ... ఒక మిల్లర్ తక్కువ అనే విషయాలకు తావులేదు. గతంలో జరిగిన వాటితో నాకు సంబంధం లేదు.

- స్వామి కుమార్, డీఎస్‌వో

2023-24 రబీ సీజన్‌లో కేటాయించిన ధాన్యం వివరాలు

మిల్లు పేరు	కేటాయించిన ధాన్యం మెట్రిక్ టన్నులు	అందించాల్సిన బియ్యం ఏసీకేలలో	అందించిన బియ్యం ఏసీకేలలో
శ్రీసాయి ట్రేడింగ్ మిల్లు బీచుపల్లి..	4.758.240	111.528	55.000
జగదాంబ ఆగ్రోటెక్, అనంతపురం	4482.640	104.936	72.000
శ్రీలక్ష్మి వెంకటేశ్వర సాయి పారా బాయిల్డ్ రైస్ మిల్లు, కోదండాపురం	2835.840	66.496	66.000
మణికంఠ రైస్‌మిల్లు కొండపల్లి, గద్వాల.	4118.080	96.482	000
జోగుళాంబ రైస్ మిల్లు బుక్కాపురం.	255.280	5.898	000
శ్రీలక్ష్మి వెంకటేశ్వర రైస్‌మిల్లు బుక్కాపురం..	606.360	14.009	000
కమ్మిడి స్వామి రైస్‌మిల్లు నందిన్నె	2082.280	48.108	000

అడవిలోకి వెళ్లిన చెంచు కూలీ అదృశ్యం

- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు



అడవిలో గాలిస్తున్న గిరిజనులు, పోలీసులు

లింగాల, అక్టోబరు 3 : అటవీ ఉత్పత్తులు సేకరించడానికి వెళ్లిన చెంచు కూలీ అదృశ్యమయ్యాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని ఎర్రపెంటకు చెందిన నిమ్మల శంకర్ శ్రీరంగాపూర్ చెందిన కృష్ణతో కలిసి శనివారం అటవీ ఉత్పత్తులు సేకరించడానికి సలేశ్వరం వెళ్లే దారి నుంచి ఎంద్రకాయ సెలిమి గుట్ట వైపు వెళ్లారు. రాత్రి ఇద్దరూ అడవిలోనే పడుకున్నారు. ఉదయం లేచి చూ సేసరికి నిమ్మల శంకర్ కనిపించకపోవడంతో కృష్ణ చుట్టు పక్కలా వెతికిన లాభం లేక పోయింది. అతను తిరిగి ఆదివారం సాయంత్రం ఎర్ర పెంటకు చేరుకుని కుటుంబ సభ్యు లకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు నిమ్మల శంకర్ కోసం కుటుంబ సభ్యులు ఆదివారం నుంచి అడవిలో వెతుకుతున్నా ప్రయోజనం లేకపోయింది. దీంతో పోలీసులు, ఫారెస్టు అధికారులను సంప్రదించారు. గురువారం ఫారెస్టు అధికారులతో కలిసి పోలీస్ అడవిలో వెతికినా ఆచూకీ దొరకలేదు. బాధితుడికి భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు.

కటౌట్ విరిగిపడి మహిళకు గాయాలు

గద్వాల క్రైం, అక్టోబరు 3 : జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ సమీపంలో ఉన్న భారీ కటౌట్ గురువారం వీచిన గాలికి కుప్పకూలింది. దీంతో అక్కడే ఉన్న బీసీ కాలనీకి చెందిన మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను స్థానికులు గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే ధరూర్ మెట్టు ప్రాంతంలో ఫ్లెక్సీలు విద్యుత్ తీగలపై పడటంతో ప్రజలు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు.

కురుమూర్తి ఆలయ పాలకవర్గం ఏర్పాటుకు పచ్చజెండా

చిన్నచింతకుంట, అక్టోబరు 3: కురుమూర్తి వేంకటేశ్వరస్వామి ఆలయ పాల కవర్గ ఏర్పాటుకు సంబంధించిన జీవోతో ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది. పాలకవర్గం ఏర్పాటులో గౌని గోవర్ధన్‌రెడ్డి, ఏ.భారతీ, నెల్లి ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బి.శేఖర్, కె.భాస్కరాచారి, నాగరాజు, ఎం.రాఘవేంద్ర, వి.కమలాకర్, గౌనిరాము, వ న్నాడ గోపాల్, ఏ.చక్రవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎం.రాములుతో పాటుగా ఎక్స్ అఫి షియో సభ్యుడిగా ఎన్.వెంకటయ్యను ఆలయ అర్చకుడని నియమిస్తూ జీవో జారీ చేసింది. త్వరలో కురుమూర్తి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పాలకరవర్గం త్వరలోనే కొలువుదీరనున్నట్లు తెలిసింది. అందు కు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కృషి చేశారు.

చెక్‌డ్యాం నిర్మాణం.. స్థానికులకు శాపం

- వాగులో మృతదేహాలు పూడ్చేందుకు ఇబ్బందులు
- పూడ్చిన మృతదేహాలు పైకి తేలుతున్నాయని ఆందోళన
- తాగునీరు కలుషితమవుతుందని ఆవేదన


చిన్నచింతకుంట శివారులో చెక్‌డ్యాంలో నిల్వ ఉన్న నీరు

చిన్నచింతకుంట, అక్టోబరు 3 : వరద నీటిని నిల్వ చేసి, భూగర్భ జలాలను పెంచేందుకు నిర్మి ంచిన చెక్‌డ్యాం మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచి ంతకుంట మండల కేంద్రం సమీపంలో స్థానికు లకు శాపంగా మారింది. ముఖ్యంగా చెక్‌డ్యాంకు అతి సమీపంలోని స్థానికులకు నిత్యం కంటి మీద కునుకు లేకుండా పరిస్థితి నెలకొంది. మొదట చెక్‌డ్యాం నిర్మాణంతో గ్రామానికి కొత్తకళ ఉంటుందని, చెక్‌డ్యాంలో నీరు నిల్వ ఉండటం కారణంగా నిత్యం కురుమూర్తిస్వామి దర్శనం కోసం వచ్చే భక్తులతో పాటుగా చూపరులను ఎంత గానో ఆకట్టుకుంటుందని భావించారు. ఊక చెట్టు వాగులో కాజ్‌వే కం చెక్‌డ్యాం గత ప్రభుత్వ హ యాంలో నిర్మాణం జరిగింది. అయితే హైలెవల్ వంతెన నిర్మాణంలో వాహనాల రాకపోకలకు ప్రయోజనం ఉంది. కొత్తకోట, వనపర్తి, కర్నూలు తదితర ప్రాంతాలకు రాకపోకలు చేసేందుకు ఎంతో ప్రయోజనం చేకూరింది.

మునిగిన సమాధులు

స్థానికులు ఎవరైనా మృతి చెందితే.. వాగు శివారు ప్రాంతాల్లోనే ఎన్నో ఏళ్లుగా పూడ్చుతు న్నారు. అయితే చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టడంతో వాగులో పూడ్చేం దుకు అవకాశం లేకుండా పోయింది. వాగులో నిండుగా నీరు ఉండటం కారణంగా గోతులు తవ్వు తుంటే నీరు వస్తుంది. ఒక్కో మారు నిలిచిన నీరు ఉండటంతో మృతదేహాలు నీటిపై తేలుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లలోకి పాములు

వాగు మధ్యన ఎన్నో ఏళ్లుగా తాగునీటి కోసం స్థానికుల అవసరం నిమిత్తం ఊటబావులను పం చాయతీ తరుపున ఏర్పాటు చేశారు. అయితే భారీగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రం సమీపంలోని చెక్‌డ్యాంలకు నీరు చేరింది. ఈ నేపథ్యంలోనే స్థాని కులకు కల్పతరువుగా ఉన్నటువంటి ఊట బావుల్లోని నీరు పూర్తిగా కలుషిత మవుతున్నదని స్థానికులు వాపోతున్నారు. అయితే తాగునీటి అవసరాల నిమిత్తం వాగు వద్ద కొత్తబోర్లు వేసినా, వాగులోని నీరే ఫిల్టర్ వాటర్ మాదిరిగా చాలా వరకు సుర క్షితంగా ఉండేవని, వాటినే తాగేవారమని స్థానికులు తెలిపారు. చెక్ డ్యాంలో నీరు చాలా రోజుల వరకు నిల్వ ఉంటే పూర్తిగా కలుషితమై, వ్యాధులకు గురయ్యే అవకా శం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాగులో మృతదేహాలు తేలడం, విష పురుగు లు ఉండటం, దోమలు వ్యాప్తి చెందడంతో చిన్న పిల్లలు, పెద్దలు జ్వరాల బారిన పడుతు న్నామని వాపోతున్నారు. నీరు మరికొన్ని రోజులు నిల్వ ఉంటే దుర్వాసన వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. అసలు ఇళ్లలో ఉండలేక పోతు న్నామని వాగు సమీపంలోని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముందే గుర్తించకపోవడంపై ఆగ్రహం

మండల కేంద్రం సమీపంలోని వాగు శివారులో నిర్మించిన చెక్‌డ్యాం నిర్మాణ సమయంలో అధికారు లు, స్థానిక ప్రజాప్రతినిధులు కలిగే ఇబ్బందులపై ముందే గమనించకపోవటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇబ్బందులు పడుతున్న సమ యంలో పట్టించుకోకపోవటంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వాగులోని నీటిని తొలగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జ్వరాల బారిన పడుతున్నాం



మండల కేంద్రం సమీపంలోని వాగులో నిర్మించిన చెక్‌డ్యాంలోని నీరు, ఊట బావుల్లోని నీరు కూడా కలుషి తమైంది. దోమలతో జ్వరాల బారిన పడుతున్నాం, చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. వాగులోని మృతదే హాలు నీటిలో తేలుతున్నాయి. మృతదేహాలపై బండలు పెట్టే పరిస్థితి నెలకొంది. ఇలా అయితే భవిష్యత్‌లో మరింత ఇబ్బందులు ఎదురవుతాయి.

- కుమ్మరి శ్రీనివాసులు, చిన్నచింతకుంట

ఇళ్లలోకి పాములు వస్తున్నాయి



చెక్‌డ్యాం వల్ల నీటిలోని పాములు, పురుగులు, దోమలు ఇళ్లలోకి వస్తున్నాయి. వాగు దగ్గరగా ఉన్న కారణంగా చాలా వరకు నివాసం ఉండేవారికి ఇబ్బ ందులు ఏర్పడుతున్నాయి. నీరు తాగలే ని పరిస్థితి ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణం చెక్‌డ్యాంలోని నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

- దాసరి చంద్రుడు, 2వ వార్డు, చిన్నచింతకుంట

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ టోర్నీలో పతకాలు సాధించాలి


అథ్లెటిక్స్ ఎంపికలను ప్రారంభిస్తున్న ఎస్పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 3: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని ఒలంపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్ సూచించారు. వరంగల్ జిల్లాలో ఈ నెల ఏడు, ఎనిమిద వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లాల అథ్లెటిక్స్ పోటీ ల్లో పాల్గొనే జిల్లా అండర్ - 14, 16, 18, 20 బాల, బాలికల జట్ల ఎంపికలను గురువారం స్థాని క స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారు లకు కొదవ లేదని, ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రా ణిస్తున్నారని గుర్తు చేశారు. క్రీడలకు పూర్వవైభవం కోసం కృషి చేస్తా మని, రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. ప్రతి భ గల క్రీడాకారులకు అండగా ఉంటామని తెలి పారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ పుట్టి సురేష్‌చందర్, శరత్‌చంద్ర, రమేశ్‌బాబు, శ్రీని వాసులు, రాజు, పి.శ్రీనివాసులు, కోచ్‌లు ఆనంద్, సాధిక్‌అలీ, సునీ ల్‌కుమార్ పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

గోపాల్‌పేట, అక్టోబరు 3 : రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలకు బాల, బాలికల విభాగంలో వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్ర ంలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ సురేందర్‌రెడ్డి గురు వారం తెలిపారు. బాలుర విభాగంలో ప్రశాంత్, మహేష్ 5వ తేదీ నుంచి మెదక్ జిల్లా సిద్దిపేటలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఆడుతారని తెలిపారు. అలాగే బాలికల విభాగంలో మీనాక్షి, ప్రణవి, శిరిష ఎంపికయ్యారని, వీరు 6వ తేదీన ఖమ్మం జిల్లాలో పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం రమాకాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.

మల్లికార్జున ఖర్గేతో ఎంపీ మల్లు రవి భేటీ


ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ

న్యూఢిల్లీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఢిల్లీలోని ఆయన నివాసంలో నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి గురువారం భేటీ అ య్యారు. ఇటీవల జ మ్మూ కశ్మీర్ ఎన్నికల ప్రచారంలో ఖర్గే స్వల్ప అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఆయనను కలిసి పరామర్శించా రు. అంతకుముందు పార్లమెంటరీ ఎస్సీ, ఎస్టీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఫగ్గన్ సింగ్ కులస్తేతో భేటీ అయ్యి దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పలు అంశాలపై మల్లు రవి చర్చించారు.

ఒకే ఏడాదిలో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు

- జోగుళాంబ గద్వాల జిల్లా వాసి ఘనత


కె. వీరేష్

ధరూరు, అక్టోబరు 3 : ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడం గగనమవుతున్న ఈ రోజుల్లో.. కేవలం ఒకే ఏడాది(2024)లో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాల కు అర్హత సాధించి అందరి చేత శభాష్ అనిపించు కున్నాడు. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం గుడ్డెందొడ్డికి చెందిన గోవిందమ్మ, మున్నె ప్ప దంపతుల మొదటి సంతానం కె. వీరేష్ ఈ ఘనత సాధించాడు. వీరిది వ్యవసాయ కుటుంబం. స్వగ్రామంలో ప్రభు త్వ పాఠశాలలో విద్యను అభ్యసించాడు. ఓపెన్ డిగ్రీ, పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశాడు. హైదరాబాద్‌లో ఉంటూ పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. గురుకుల, గ్రూప్-4, డీఎస్సీ పరీక్షలు రాశాడు. గురుకులంలో ఉద్యోగం రాగా, ప్రస్తుతం కేటీ దొడ్డి బాలుర గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వ హిస్తున్నాడు. మెగా డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌ఏలో జిల్లాస్థాయి రెండో ర్యాం కు, ఎస్‌జీటీలో 39వ ర్యాంకు సాధించాడు. గ్రూప్-4 పరీక్షలో అర్హత సాధి ంచగా, ధ్రువపత్రాల పరిశీలన పూర్తయ్యింది.

సాధారణ కాన్పు కోసం ప్రయత్నం

- ఆపరేషన్ చేయడంతో శిశువు మృతి
- ఆసుపత్రి ఎదుట ఆందోళన
- వైద్యుల నిర్లక్ష్యంపై పోలీసులకు ఫిర్యాదు


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

వనపర్తి రూరల్, అక్టోబరు 3 : జిల్లా కేంద్రంలోని నర్సింగాయపల్లి మాతా శిశు సంరక్షణ కేంద్రంలో వైద్యం వికటించి శిశువు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. చిన్నంబావి మండలం పెద్దదగడకు చెందిన రాకేష్, అనూష దంపతులకు గతేడాది వివా హమైంది. అనూష గర్భం దాల్చి తొమ్మిది నెలలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి ఈనెల 1న వచ్చి చేరింది. వైద్యులు సాధారణ కాన్పు చేసేందుకు ఆమెను ఉంచారు. అర్ధరాత్రి దాటి న తరువాత నొప్పులు అధికంగా రావడంతో వైద్య సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదు. కాసే పటి తరువాత విపరీతంగా నొప్పులు రావడంతో వైద్యులు స్పందించారు. వైద్యులు సాధారణ కాన్పు చేసేందుకు ప్రయత్నించారు. ఇదే సందర్భంలో ఇబ్బంది కావడంతో వైద్యులు వెంటనే ఆపరేషన్ చేశారు. అంతలోపే ఆమె కడుపులో ఉన్న శిశువు మృతి చెందింది. వైద్యులను నమ్ముకుంటే ఇలా చేశారని ఆవేదనతో మృతి చెందిన శిశువుతో ఆసుపత్రి ఎదుట నిరసన చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చాలా అరాచకాలు జరుగుతున్నాయని, డబ్బులు వసూలు చేస్తున్నారని, మళ్లీ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను డిమాండ్ చేశారు. దాదాపు రెండు గంటల పాటు నిరసన తెలుపగా, ఎవరూ పట్టిం చుకోకపోవడంతో వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సీఎం కప్-2023 విజేతలకు ట్రోఫీలు

- వాలీబాల్ విజేత మహబూబ్‌నగర్
- ఫుట్‌బాల్ రన్నర్ జోగుళాంబ గద్వాల


సీఎం కప్-2023 కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్, క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 3: గతేడాది నిర్వహి ంచిన సీఎం కప్-2023 విజేత లకు స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వ ర్యంలో గురువారం ట్రోఫీలు, నగదును అందజేశారు. సీఎం కప్ - 2024 మస్కట్ లోగోను గురువారం ఎల్‌బీ స్టేడి యంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అదేవిధంగా గతేడాది విజేతలకు బహుమ తులు ప్రదానం చేశారు. వాలీ బాల్‌లో మహబూబ్‌నగర్ జిల్లా విజేతగా నిలిచి స్వర్ణ పతకం, రూ.లక్ష నగదు, ట్రోఫీ, రన్నర్‌గా నిలిచిన జో గుళాంబ జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు రజత పతకంతో పాటు రూ.75వేల నగదు శాట్స్ ప్రతినిధులు అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లాకు ఆర్చరి, వెయిట్ లిఫ్టింగ్, జావెలి న్‌త్రోలో పతకాలు సాధించారు. విజయ్‌కుమార్ జావె లిన్‌త్రోలో రజత పతకం, వెయిట్ లిఫ్టి ంగ్ శ్రీకాంత్ (రజత), విష్ణువర్ధన్ ఆర్చరి (రజత) పతకం సాధించారు. వీరికి రూ.15వేల నగదు, పతకంతో సత్కారించారు. సుజాత ఆర్చ రీలో కాంస్య పతకం సాధించగా రూ.10వేల నగదు, పతకంతో సత్కరించారు. శాట్ చైర్మన్ శివాసేనరెడ్డితో పలువురు జిల్లా క్రీడాకారులను అభినందించారు. మహ బూబ్‌నగర్ జిల్లా డీవైఎస్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 15 నుంచి క్రీడాజ్యోతి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 3 : గ్రామీణ క్రీడాకారులను ప్రపంచ చాంపియన్ లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ - 2024లో భాగంగా 33 జిల్లాలో క్రీడాజ్యోతి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం క్రీడాజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 15న నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉదయం కొత కలెక్టరేట్ నుంచి లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌కు చేరుకుంటుంది. సాయంత్రం వనప ర్తి జిల్లా చిట్యాల నుంచి కలెక్టరేట్ వరకు రన్ కొనసాగుతుంది. 16న జోగు ళాంబ గద్వాల జిల్లా లో ఉదయం సంగాల పార్కు నుంచి, ధరూర్ మీదుగా, కలెక్టరేట్ చౌరస్తా వరకు రన్ కొన సాగుతుంది. సాయంత్రం తిప్రాస్‌పల్లి నుంచి నారాయణపేట జిల్లా నర్సిరెడ్డి చౌరస్తా వరకు రన్ కొనసాగుతుంది. 17న ఉదయం మహబూబ్‌నగర్‌లోని మయూరి ఏకో పార్క్ నుంచి జిల్లా కేంద్రానికి 10కే రన్ చేరుకుంటుంది. ఆయా జిల్లాల క్రీడాశాఖ అధికారులు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారు.

బైక్‌పై నుంచి కింద పడి మహిళ మృతి


బొల్లె లక్ష్మి (ఫైల్)

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 3 : ప్రమాదవశాత్తు బైకుపై నుంచి కింద పడి ఓ మహిళా మృతి చెం దిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని నక్క లపల్లి స్టేజీ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం.. మండలం లోని దేవునితిర్మలాపూర్ చెందిన బొల్లె లక్ష్మి (38), భర్త నాగేష్ బైక్‌పై వెన్నచెర్లలోని అత్తా రింటికి వెళ్లి తిరిగి దేవునితిర్మలాపూర్‌కు బయలు దేరారు. మార్గమధ్యలో శ్మశానవాటిక వద్ద ప్రమాదవశాత్తు బొల్లె లక్ష్మి జారి బైకు పై నుంచి కింద పడడంతో తీవ్రంగా యాలయ్యాయి. వెంటనే ఆమెను నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెంది నట్లు పోలీసులు తెలిపారు. కుమారుడు దినేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మల్లేష్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమా రులు ఉన్నారు.

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

హన్వాడ, అక్టోబరు 3 : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని మునిమోక్షంలో పూడ్చిన మృతదేహానికి బ యటకు తీసి గురువారం పోస్టుమార్టం చేశారు. గ్రామ స్థులు తెలిపిన వివరాలు ప్రకారం.. మునిమోక్షం చెందిన దండు అంజిలయ్య జనవరి 15వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. అతని రెండో భార్య అంజిలమ్మ భర్త మృ తిపై అనుమానం ఉందని కోర్టుకు వెళ్లింది. కోర్టు ఆదే శాలతో గురువారం పోలీసులు, రెవెన్యూ అధికారుల సమ క్షంలో డాక్టర్లు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేశారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మాహత్యాయత్నం

కోడేరు, అక్టోబరు 3 : పురుగుల మందు తాగి యువకు డు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం జనుంపల్లిలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం మేరకు పర్వతాలు వారి కుమారుడు కృష్ణ గొడవ పడుతుండగా వరుసకు కొడుకు అయిన సాంబశివుడు విడిపించేందుకు వెళ్లాడు. వారు సాంబశివుడిని మందలించడంతో తిరిగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో తన అన్న శంకర్ కూడా తిట్టడంతో మనస్తాపానికి గురైన సాంబశివుడు ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగా డు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వివాహిత అదృశ్యం

నవాబ్‌పేట, అక్టోబరు 3 : మహబూబ్‌నగర్ జిల్లా నవా బ్‌పేట మండలంలోని మరికల్ చెందిన వివాహిత అదృ శ్యమైందని భర్త గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మరికల్ చెందిన బజారి శివ, అదే గ్రామానికి చెందిన బానుతో రెండేళ్ల క్రిత ం వివాహమైంది. ఆమె చౌడాపూర్ మండల కేంద్రం లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పని పనిచేస్తుండగా, భర్త టెంట్ హౌస్ నిర్వహిస్తున్నాడు. గత నెల 26న తనకు హైదరాబాద్‌లో నర్సు పోస్టుకు దరఖాస్తు చేసేందుకు వెళ్తా నని భర్తకు చెప్పింది. దసర పండుగ తర్వాత వెళ్దామని చె ప్పడంతో గత నెల 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెళ్లిపోయింది. ఆందోళన చెందిన భర్త, బంధువుల వద్ద వెతి కినా ఆచూకీ లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యా దు చేసినట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు.

పెట్రోల్ బంకు క్యాషియర్ అదృశ్యం

జడ్చర్ల, అక్టోబరు 3 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని నిమ్మబావిగడ్డ ప్రాంతంలోని పెట్రోల్ బంకు లో పనిచేస్తున్న క్యాషియర్ కనిపించడంలేదని యజమాని శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఆదిరెడ్డి గురువారం తెలిపారు. కర్ణాటక రాష్ట్రం, గుల్బర్గా జిల్లా, చించోలు తాలుకా , కల్లూరు చెందిన శాంత్‌కుమార్ నాలుగేళ్లుగా క్యాషియర్‌గా పనిచేస్తున్నాడని, ఒవటవ తేదీన ఉదయం బంకు తెరిచాడని ఫిర్యాదులో పేర్కొన్నారని తెలి పారు. అనంతరం ఉదయం ఆరు గంటల నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లాడని, డ్యూటీకి రాకపోవడంతో ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేదన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వివరించారు.

బైక్‌ను ఢీకొన్న వాహనం

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు

భూత్పూర్, అక్టోబరు 3: బైక్‌పై వెళ్తున్న వారిని వెనకాల నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం 44వ జాతీయ రహ దారిపైన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మునిసి పాలిటీలోని పదో వార్డుకు చెందిన కుమ్మరి శివ, పిచ్చకుంట్ల ఎలప్ప కలిసి బైక్‌పై జడ్చర్లకు వెళ్లారు. తిరిగి గ్రామానికి వస్తుండగా భూత్పూర్ పరిధిలోని తాటిపర్తి శివా రులో వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వీరిద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా కుమ్మరి శివ (36) మార్గమధ్యలోనే మృ తి చెందాడు. అక్క కుమ్మరి తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం

ఖిల్లాఘణపురం, అక్టోబరు 3 : తన ప్రమేయం లేకుం డానే బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయమైనట్లు బాధి తుడు పోలీసులను ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళితే.. వన పర్తి జిల్లా ఖిల్లాఘణపురం చెందిన సింగనమోని కృష్ణయ్య బ్యాంకు ఖాతా ద్వారా రూ.14,300 డ్రా అయినట్లు గుర్తించి గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యా దు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ గౌడ్ తెలిపారు. కృష్ణయ్య అకౌం ట్ ద్వారా ఈనెల 2వ తేదీన రూ.2వేలు డెబిట్ అయినట్లు ఫోన్‌కు మెసెజ్ వచ్చింది. బ్యాంకు స్టేట్‌మెంట్ తీసుకోగా విడతల వారీగా డబ్బులు డ్రా అయినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏటీఎంలో రూ.500 బదులు రూ.20, రూ.10 నోట్లు

మన్ననూర్ అక్టోబరు 3 : నాగర్‌కర్నూల్ అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ ఏటీఎం వద్ద నగదు విత్ డ్రా చేస్తే రూ.500 నోట్లకు బదులు రూ.10, రూ.20 నోట్లు రావ డంతో ఖాతాదారులు కంగుతిన్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్ననూర్ జీసీసీ గోదాం ఇన్‌చార్జిగా పనిచేస్తున్న రాములు గురువారం మధ్యాహ్నం 12:30 గం టలకు మన్ననూర్ ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.20వేల నగదు విత్‌డ్రా చేశారు. 19 రూ.500 నోట్లు, ఒక రూ.పది నోటు వచ్చిందన్నారు. అదేవిధంగా అరగంట వ్యవధిలో రాజారాం రూ.15వేలు విత్‌డ్రా చేయగా 29 రూ.500 నోట్లు, ఒక రూ.20 నోటు వచ్చినట్లు తెలిపారు. ఈ విషయంపై బ్యాం కు మేనేజర్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారిలో గల ఏటీఎం దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు సేవలందిస్తోం ది. ఇలాంటి ఘటనతో ఖాతాదారులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని వారు వాపోయారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మహబూబ్‌నగర్, అక్టోబరు 3 : అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి వైద్యం చేయించుకున్న పేదలకు సీఎం సహాయనిధి నుంచి వచ్చిన చెక్కులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 88 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు మల్లు నర్సింహ్మారెడ్డి, సిరాజ్‌ఖాద్రి, పెద్ద విజయ్, టంకర కృష్ణయ్య, యాదిరెడ్డి, రజియా అంజద్, పాషా, రాశెద్, జాజిమొగ్గ నర్సింహులు, అవేజ్, పీర్‌సాదిక్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల ప్రణాళికలు సిద్ధం చేయాలి

కోయిలకొండ, అక్టోబరు 3 : మండలంలోని గ్రామ పంచాయతీల్లో 2025-26 సంవత్సరానికి ఉపాధి పనుల ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపీడీవో కాళప్ప సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 2 నుంచి గ్రామాల్లో గ్రామసభలను ఏర్పాటు చేసి ఉపాధి పనుల వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. త్వరగా ప్రణాళికలను సిద్ధం చేసి కార్యాలయానికి పంపాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మిషన్ భగీరథ ఏఈ శివతేజ, ఏఈ ఏపీవో నర్సయ్య పాల్గొన్నారు.

గ్రామ తాగునీటి సహాయకులకు అవగాహన



గ్రామ సహాయకులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న నీటి పారుదల శాఖ అధికారులు

రాజాపూర్, అక్టోబరు 3 : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన గ్రామ తాగునీటి సహాయకులకు ఆరు రోజుల నుంచి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం రాజాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో నీటి నాణ్యత పరీక్షలు, చేతిపంపుల వాడకం, ప్లంబింగ్, సింగిల్ ఫేస్, త్రీ ఫేస్ మోటార్ల, ప్యానెల్‌బోర్డుల పరీక్షలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈ అభినవ్, ఎంపీడీవో మచ్చేందర్, ఎంపీవో వెంకట్‌రాములు, మిషన్ భగీరథ అధికారులు శ్రీనివాస్‌లు, మురళి, శివకుమార్ పాల్గొన్నారు.

బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా తంగెళ్ల జ్యోతి

- 9న ప్రమాణస్వీకారం చేయనున్న పాలకవర్గం



తంగెళ్ల జ్యోతి

జడ్చర్ల, అక్టోబరు 3: బాదేపల్లి మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్‌గా తంగెళ్ల జ్యోతి నియామకమయ్యారు. అగ్రికల్చర్ అండ్ కార్పోరేషన్ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్‌గా తంగెళ్ల జ్యోతి, వైస్ చైర్మన్‌గా రాజేందర్‌గౌడ్‌ను నియమించారు. అలాగే డైరెక్టర్లుగా వన్నంకృష్ణయ్య, ముడావత్ రాజునాయక్, కురుమిద్దె యాకూబ్, సి.లక్ష్మయ్య, ఖాజా అలీముద్దీన్, బొల్లం సత్యనారాయణగౌడ్, నల్లనారాయణరెడ్డి, కొంగళియాదయ్య, ద్యాప శ్రీనివాస్‌రెడ్డి, మౌరుగొల్ల బంగారయ్య, సునీల్‌సాంక్ల, శివకిశోర్‌ను నియమించారు. వీరితో పాటు బాదేపల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ జడ్చర్ల, మునిసిపాలిటీ చైర్‌పర్సన్లు సభ్యులుగా ఉన్నారు. నూతన కార్యవర్గం ఈ నెల 9న ప్రమాణస్వీకారం చేయనున్నారు.

ఉరి వేసుకొని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

జడ్చర్ల, అక్టోబరు 3: జడ్చర్ల పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న ఎద్దుల స్ఫూర్తి(17) ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈ నెల 2న పెద్దల పండుగ సందర్భంగా తల్లితో కలిసి బిజినేపల్లి మండలం మహదేవునిపేటకు వెళ్లి తిరిగి సాయంత్రం జడ్చర్ల హౌజింగ్ బోర్డు కాలనీలోని ఇంటికి వచ్చారు. అర్ధరాత్రి విద్యార్థిని ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వేలాడుతుండగా.. తల్లి రాగజ్యోతి చూసి, వెంటనే భర్త ఎద్దుల జంగిరెడ్డికి విష యం తెలియజేసింది. వెంటనే స్ఫూర్తిని చికిత్స నిమిత్తం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తర లించగా.. అప్పటికే మృతిచెందిందని వైద్యులు తెలిపారు. స్ఫూర్తి తండ్రి ఎద్దుల జంగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఆదిరెడ్డి తెలియజేశారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బతుకమ్మ ఉత్సవాలు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 3 : దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక కొత్తగంజ్ లక్ష్మీన ర్సింహస్వామి దేవాలయంలో మహిళలు గురువారం బతకమ్మ ఆడారు. బుధవారం నుంచి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కొత్తగంజ్ మహిళలు రంగురంగుల పూలు పేర్చి బతుకమ్మలను తయారు చేసి సాయంత్రం పూజలు నిర్వహించి బతుకమ్మ ఆడారు. ఈ బతుకమ్మ ఉత్సవాలు ఈ నెల 11 వరకు నిర్వహించనున్నారు.

బతుకమ్మ సంబురాలు



సాందీప పాఠశాలలో బతుకమ్మ సంబురాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిన్నచింతకుంట, అక్టోబరు 3 : మండల కేంద్రంలోని సాందీప పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబురాలను విద్యార్థులు జరుపుకున్నారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆట, పాటలతో అలరించారు. వివిధ పూలతో బతుకమ్మలను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కాంతయ్య, ప్రిన్సిపాల్ కృష్ణయ్యలు, పాఠశాల ఉపాధ్యాయులు సుధాకర్, నవీన్, వెంకటేష్, రాగిని, రేవతి, కవిత, శ్రీలత, ఫాతిమా, సౌమ్య, విద్యార్థులు రిషిక, మణి తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు జిల్లా విద్యార్థుల పయనం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 3: సంగారెడ్డి జిల్లాలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు జిల్లా విద్యార్థులు గురువారం జిల్లా కేంద్రం నుంచి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి టోర్నీలో పతకాలు సాధించాలని ఆకాక్షించారు. బాలురు-11 మంది, బాలికలు 10 మొత్తం 21 మంది విద్యార్థులు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో కార్యదర్శి సాయికుమార్, సురేష్ పాల్గొన్నారు.

మల్లేపల్లి చెరువులో చేపపిల్లలు విడుదల



చెరువులో చేపపిల్లలను వదులుతున్న గ్రామ మత్స్యకారులు, నాయకులు

రాజాపూర్, అక్టోబరు 3 : మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామ శివారులోని చెరువులో గురువారం మత్స్యకారులు చేపపిల్లలను వదిలారు. మత్స్యకారులు, ముదిరాజ్ సంఘం నాయకులు పలువురు మాట్లాడుతూ మత్స్యసంపదను పెంచేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మతస్య కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కావలి రామకృష్ణ, వెంకట్ రాజ్, సూరి, శ్రీనివాసులు, శేఖర్, రాము, గిరి, గ్రామస్థులు పాల్గొన్నారు.



సింహగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



బాలాత్రిపుర సుందరిదేవి అవతారంలో వెండిపోచమ్మ



సరస్వతి ఆలయంలో బాలాత్రిపుర సుందరీ అలంకారంలో అమ్మవారు



రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బాలాత్రిపురసుందరీగా అమ్మవారు

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- దుర్గామాతకు పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ టౌన్/ పాలమూరు/ మహబూబ్‌నగర్ న్యూటౌన్/ హన్వాడ/ నవాబ్‌పేట/ దేవరకద్ర/ కోయిలకొండ/ గండీడ్/ భూత్పూర్/ జడ్చర్ల/ రాజాపూర్/ మూసాపేట/ చిన్నచింతకుంట, అక్టోబరు 3 : దేవీ నవరాత్రుల సందర్భంగా పాలమూరులోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ప్రాంగణంలో కామేశ్వరి సమేత ఐశ్వర్యేశ్వర స్వామి దేవాలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారికి పట్టు వస్త్రాలను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమర్పించారు. అంతకుముందు మార్కెట్‌యార్డు నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు శివుడి ముఖ కవచాన్ని, పట్టు వస్త్రాలు, కలశం ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. అనంతరం ఎమ్మెల్యేకు అర్చకులు వేద ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనితమధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజ్మత్‌అలీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వై.అచ్చన్న, పోల శ్రీనివాస్, కె.చంద్రశేఖర్, ఎం.లక్ష్మీనారాయణ, ఓం ప్రకాష్, బి.వినోద్ పాల్గొన్నారు.

● దేవీ నవరాత్రిలో భాగంగా మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ ఎల్లమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు పొల్గొన్నారు

అమ్మ వారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో పూజలందుకున్నారు. స్థానిక రేణుకా ఎల్లమ్మ దేవాలయం, సరస్వతి దేవాలయం, కన్యకాపరమేశ్వరి దేవాలయంతో పాటు పలుదేవాలయాలలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. జిల్లా కేంద్రంలో శ్రీవాసవీమాత కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆభరణాల ఊరేగింపు అధ్యక్షుడు గుండా వెంకటేష్ ఇంటినుంచి ప్రారంభించారు. ఊరేగింపులో కొండా చక్రధర్‌గుప్త, ఎదిర ప్రమోద్‌కుమార్, పూజారి గొండ్యాల రాఘవేంద్రశర్మ, ఆర్యవైశ్యులు, మహిళలు పాల్గొన్నారు. వెండిపోచమ్మ ఆలయంలోనూ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రావణ్‌కుమార్, జి.మల్లేష్, బి.వేదవ్రత్, కె.ఎల్లప్ప, కొత్త సత్యం, కె.బాలస్వామి, బి.ఆనంద్ కుమార్ తెలిపారు.

హన్వాడ మండలంలో అమ్మవారి పూజలో కొండ బుచ్చిరెడ్డి, మాధవులుగౌడ్, వెంకటేష్, సత్యం, చెన్నయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు. నవాబ్‌పేట మండలం పర్వతాపూర్ మైసమ్మ ఆలయంలో దేవి శరన్నవ రాత్రులు ప్రారంభమయ్యాయి. దేవరకద్ర నియోజకవర్గంలోని దేవరకద్ర, కౌకుంట్ల మండలాల్లోని గ్రామాల్లో మండపాలలో దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. కోయిలకొండ మండలంలోని ఆచార్యపూర్ భద్రకాళి వీరభద్రస్వామి దేవాలయం, శ్రీలక్ష్మీ నృసింహస్వామి వివిధ ఆలయాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. భూత్పూర్ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో అమ్మవారిని ప్రతిష్ఠించి భక్తులు పూజలు చేశారు. జడ్చర్ల పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. వాసవీకన్యకపరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారిని కాత్యాయిని దేవి రూపంలో అలంకరించి పూజలు చేశారు. మూసాపేట మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి, వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. చిన్నచింతకుంటలోని మాతా గంగాభవాణీ ఆలయంలో దుర్గామాత ప్రతిమను ఏర్పాటు చేశారు. అర్చకులు శివశక్తి స్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



జడ్చర్లలోని సకలదేవతల ఆలయంలో బాలాత్రిపురసుందరి దేవీ అలంకారంతో పూజలు అందుకున్న అమ్మవారు



ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా వెంకటేష్ ఇంటినుంచి వాసవీమాత ఆభరణాల ఊరేగింపు

పైలెట్ గ్రామాల్లో డిజిటల్ సర్వే ప్రారంభం

- వన్‌ఫ్యామిలీ వన్‌కార్డు కార్యక్రమానికి శ్రీకారం

- పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం, ప్రత్యేక అధికారి జి. రవి నాయక్, కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, స్థానిక అధికారులు

మహబూబ్‌నగర్/ భూత్పూర్/ హన్వాడ/ జడ్చర్ల/ చిన్నచింతకుంట, అక్టోబరు 3 : రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్ కోసం ఫ్యామిలీ డిజిటల్ యూనిక్ ఐడీ కార్డులు జారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకుగాను ప్రతీ నియోజకవర్గంలోని ఓ గ్రామ పంచాయతీ, మునిసిపాలిటీలోని ఓ వార్డును పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపి చేసింది. ఆ ప్రాంతాల్లో ఈనెల 3వ తేదీ నంచి 7వ తేదీ వరకు ఐదు రోజులపాటు నియమితులైన అధికారుల బృందం ఇల్లిల్లు తిరిగి సర్వే చేయాల్సి ఉంది. అందుకుగాను జిల్లాలో గురువారం సర్వే ప్రారంభమైంది. ఈ సర్వే పరిశీలనకు ప్రత్యేక అధికారిగా నియమితులైన జి.రవి నాయక్, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ భూత్పూర్ మునిసిపల్‌లోని 9వ వార్డులో సర్వేను పరిశీలించారు. వార్డులో అధికారులు పర్యటించి ఇంటింటా కుటుంబ సభ్యుల డేటాను సేకరిస్తున్న వివరాలను పరిశీలించారు. మునిసిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ గీత, ఎంపీవో శ్రీదేవి, రెవెన్యూ, మునిసిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ● మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండలం మాదారం గ్రామంలో జరిగిన సర్వేను కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు. రెండు టీంలు చేస్తున్న సర్వేను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. ప్రజలు అందుబాటులో ఉండి సర్వే అధికారులకు సహకరించాలని ఆమె సూచించారు. తహసీల్దార్ కిష్టానాయక్, ఎంపీడీవో యశోదమ్మ, రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయ అధికారులు పాల్గొన్నారు. ● జడ్చర్ల మునిసిపా లిటీలో సర్వే పత్రాలు సకాలంలో అందకపోవడంతో సర్వే ఆలస్యంగా ప్రారంభమైంది. 24వ వార్డులో నాలుగు బృందాలతో సర్వే చేపట్టేందుకు ప్రణాళికను తయారు చేశారు. మధ్యాహ్నం తర్వాత సర్వే పత్రాలు రావడంతో రాజాపూర్ ఎంపీడీవో మచ్చేందర్ నేతృత్వంలోని బృందం సర్వేను ప్రారంభించారు. జడ్చర్ల మండలంలోని ఆల్వాన్‌పల్లిలో రెండు బృందాలతో సర్వేను ప్రారంభించారు. అక్కడ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి రవినాయక్, జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌లు పరిశీలించారు. జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, జడ్చర్ల మునిసిపల్ కమిషనర్ రాజయ్య, జడ్చర్ల ఎంపీడీవో విజయ్‌కుమార్, సర్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ● మహబూబ్‌నగర్ పురపాలిక పరిధిలోని సద్దలగుండు 37వ వార్డులో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సర్వేను ప్రారంభించారు. నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించేందుకు ఈ కార్డు ఉపయోగపడుతుందన్నారు. రాజస్థాన్ వంటి రాష్ట్రాలలో ఇప్పటికే ఈ ప్రక్రియ విజయవంతంగా సాగుతోందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ స్వప్న, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, అర్బన్ తహసీల్దార్ ఘూన్సీరాం, నాయకులు సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్, రాములుయాదవ్, అజ్మత్‌అలీ, ఫయాజ్ పాల్గొన్నారు. ● చిన్నచింతకుంట మండలం సీతారాంపేట గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన నేపథ్యంలో స్పెషల్ కలెక్టర్ రాంరెడ్డి నేతృత్వంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో అనిల్‌కుమార్, ఆర్ఐ శశికిరణ్, హరిష్, ఏపీఎం వెంకటేశ్వరచారి తదితర అధికారుల బృందం రెండు టీంలుగా ఏర్పడి సర్వే చేపట్టారు. మధ్యాహ్నం వర్షం వల్ల కొంత ఆలస్యమైంది. గ్రామంలో 187 కుటుంబాలను సర్వే చేపట్టారు.



హన్వాడ : అధికారులు, ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

సబ్సిడీ సిలిండర్ ప్రొసీడింగ్‌ల అందజేత

గండీడ్, అక్టోబరు 3 : మండలంలోని పగిడియాల, బల్సర్‌గొండ, పంచలింగాలతండా, మన్సూర్‌పల్లి, తండాలలో గురువారం గ్యాస్ రాయితీ సిలిండర్ల ప్రొసీడింగ్‌లను ఎంపీడీవో దేవన్న, ఎంపీవో నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి మహిళలకు అందజేశారు. మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనను వెలికి తీయాలి

- జేపీఎన్‌సీఈ చైర్మన్ రవికుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 3 : విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రదర్శనలు ఉంతో అవసరమని జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవికుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. ఎగ్జిబిషన్‌లో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుజీవన్‌కుమార్, అధ్యాపకులు గురురాఘ వేంద్రరెడ్డి, రాధిక, స్వాతి, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 3 : మహబూబ్‌నగర్ ఎంప్లాయిమెంట్ శాఖ ఆధ్వర్యంలో ఐదు కంపెనీలలో పని చేసేందుకు 500 ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 5వ తేదీన జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మైత్రిప్రియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్ చదివి 18 నుంచి 40ఏళ్ల మధ్య వయస్సుల గల వారు ఈ మేళాకు హాజరు కాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.10 వేల నుంచి, రూ. 65 వేల వరకు నెలసరి వేతనం ఉంటుందని తెలిపారు. వివరాలకు 9948568830 , 9550205227లను సంప్రదించాలని కోరారు.

మిషన్ భగీరథ పైపులైను లీకేజీ

జడ్చర్ల, అక్టోబరు 3 : జడ్చర్ల మండలం ఉదండాపూర్ గ్రామంలో మిషన్‌భగీరథ పైపులైను లీకేజీ అయ్యింది. పైపులైను లీకేజీ కావడంతో గ్రామంలో సరఫరా అవుతున్న నీరు కలుషితం అవుతున్నాయని, నీళ్లను తాగి రోగాల బారిన పడే ప్రమాదం ఉందంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీ అయిన పైపులైనును వెంటనే రిపేర్ చేయించాలని, నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దివ్యాంగులకు ఆర్థిక సహాయం

హన్వాడ, అక్టోబరు 3 : దివ్యాంగులు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగేందుకు తమ సంస్థ చేయూత ఇస్తుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో హన్వాడ, కోయిల్‌కొండ మండలాలకు చెందిన అర్హులైన దివ్యాంగులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం 32 మందికి 25 వేల రూపాయల ఆర్థిక సహాయం మంజూరి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గురుదేవి, అరుణ్, ప్రసాద్‌రెడ్డి, దాసు, వీరేష్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు కామారెడ్డిలో రైతు సభ

నవాబ్‌పేట, అక్టోబరు 3 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 5న కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభకు రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని భారతీయ కిసాన్ సంఘ్ పాలమూరు జిల్లా అధ్యక్షుడు దర్పల్లి రాంరెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, పంటలబీమా ఇతర పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యదర్శి నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు జెట్టిరాములు, కార్యదర్శి రామిరెడ్డి, రఘునందన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఆస్పత్రులకు నోటీసులు

- ప్రైవేటు ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేసిన డీఎంఅండ్‌హెచ్‌వో

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), అక్టోబరు 3 : పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో గురువారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పద్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రులలో బయోమెడికల్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్, ధరల పట్టిక, ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు తదితర అంశాలను పరిశీలించారు. నిబంధనలు పాటించని కొన్ని ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా ఆయా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులతోనూ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రోగుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని, ఆసుపత్రి నిబంధనలు పాటించాలని, లేదంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి మంజుల పాల్గొన్నారు.



ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

దసరా తరువాత న్యాయవాదుల పోరాటం ఉధృతం

- న్యాయవాదిపై పోలీసుల దాడికి నిరసనగా విధులకు దూరం

మహబూబ్‌నగర్/ జడ్చర్ల, అక్టోబరు 3 : న్యాయవాదులపై వరుసగా దాడులు జరుగుతూనే ఉన్నాయని, దాడికి పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోని కారణంగానే మరిన్ని పెరుగుతున్నాయని న్యాయవాదుల సంఘం ఆరోపించింది. దసరా తరువాత న్యాయవాదుల పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లో న్యాయవాదిపై పోలీసులు చేసిన దాడిని నిరసిస్తూ గురువారం పాలమూరులో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కోర్టు విధులకు దూరంగా ఉండి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో సిటీ సివిల్ కోర్టు న్యాయవాది అబ్దుల్ హలీంపై మాదన్నపేట పోలీసులు విచక్షణారహితంగా దాడి చేయడం దారుణ మన్నారు. మాదన్నపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాదిని పోలీసులు రోడ్డుపై కొట్టుకుంటూ తీసుకెళ్లారని, దీంతో అతను స్పృహ తప్పి పడిపో యాడన్నారు. న్యాయవాదులపై వరుసదాడులు జరుగుతున్నాయని, న్యాయవా దులంతా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. దసరా తరువాత నిరవధిక కార్యక్రమాలు చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాంనాథ్‌గౌడ్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

● హైదరాబాద్‌లో న్యాయవాది మహమ్మద్ సలీంపై మాదన్నపేట పోలీసుల దాడికి నిరసనగా జడ్చర్ల కోర్టులో అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు జంగయ్య, న్యాయవాదులు మాలిక్ షాకీర్, తిరుపతి, మహేశ్వర్‌రెడ్డి, రమేశ్, శంకరాచారి, ఇప్తెకారొద్దీన్, పురుషోత్తం, శ్రీనివాస్‌గౌడ్, యాదిరెడ్డి, మురళీకృష్ణారావు, రాములు తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో కోర్టు ముందు నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

వసతులు అంతంతే..

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చిన అభ్యర్థులు

- కేంద్రాన్ని పరిశీలించిన ఆర్జేడీ విజయలక్ష్మి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 3 : డీఎస్సీ -2024 ధ్రువపత్రాల పరిశీన కేంద్రాన్ని.. జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డలోని డైట్ కళాశాల నిర్వహిస్తున్నారు. ఈ పరిశీలన గురువారం రెండో రోజు సాగింది. ఎజ్జీటీ, స్కూల్‌అసిస్టెంట్‌కు చెందిన అభ్యర్థులు వారి వెంట వచ్చిన బంధువులు తల్లిదండ్రులతో డైట్ కళాశాల ప్రాంగణం కిటకిటలాడింది. అయితే వారికి సరిపడా వసతులు మాత్రం విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేయలేదు. తాగేందుకు తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్ ఇతర సౌకర్యాలు లేక ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం వర్షం కురవడంతో అభ్యర్థులు కూర్చునేందుకు వసతులు లేక తడిసిపోయారు. డైట్ కళాశాలలోని గదులకు తాళ వేసి ఉండటంతో ఇబ్బందులకు గురయ్యారు. అక్కడే ఉన్న ఓ అధికారిని వసతుల విషయమై 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. డైట్ కళాశాలకు సెలువు ఉండటంతో సిబ్బంది రాని మాట వాస్తమేనని, అభ్యర్థులకు తాగునీటి వసతి కల్పిస్తామని తెలియజేశారు.

కేంద్రాన్ని పరిశీలించిన ఆర్జేడీ

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రలా పరిశీలన కేంద్రాన్ని రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ) విజయలక్ష్మి పరిశీలించారు అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాలను జాగ్రత్తగా పరిశీలించాలని తెలియజేశారు.

11 కేంద్రాల్లో పరిశీలన..

మొత్తం 243 పోస్టులకు గాను 1:3 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు పిలిచారు. 11 కేంద్రాలను ఏర్పాటు చేసి మొత్తం 217 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు.

తప్పులు సరిచేయాలని పీఆర్‌టీయూ వినతి

డీఎస్సీ -2024కు ఎంపికైన అభ్యర్థుల విషయంలో తప్పులు ఉన్నాయని, వాటిని సరిచేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్ మోహన్‌యాదవ్ సీఎంవో బైకనిబాలుయాదవ్‌కు అభ్యర్థులతో కలిసి వినతి అందజేశారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్జేడీ